

# ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ లక్ష్మీ సలీమ్‌తో ముఖాముఖి

జి. లక్ష్మయ్య, ద్రోణాచలం

ప్ర : నా కుమారుని వయసు 4 సం.లు. తన 2వ సం.లో మసలుమన్న నూనెలో పొరపాటునపడి కుడి ప్రక్క ముఖభాగం, గొంతు దగ్గర భాగం కాలడంవల్ల బాగా ముడుచుకుపోయినది. కుడి చెవి కూడా ముడుచుకుపోయి, చేతితో చెవిలాగితే రంధ్రం మాత్రం కనబడుతుంది. ఈ ముడుచుకుపోయిన భాగాలను ప్లాస్టిక్ సర్జరీ చేసి ప్రస్తుత వయసులో సరిచేయవచ్చా?

జ: మీ కుమారునికి ఏర్పడిన పరిస్థితిని 'పోస్ట్ బర్న్ కంట్రాక్చర్' అంటారు. అతనికి ఈ వయసులో ఆపరేషన్ చేయవచ్చు - కాని చిన్న వయసులో ఆపరేషన్ చేయడానికి సదుపాయం వున్న ఆస్పత్రిలోనే వీలవుతుంది మరి! బహుశా ఈ వసతి లేక మిమ్మల్ని ఆగమని వుండవచ్చు!

## శిరోజాలు లేవు!

వై. వసుమూర్తి, హైద్రాబాదు

ప్ర : మీరు బట్టతల గురించి ఇచ్చిన జవాబుల్లో 'హెయిర్ ట్రాన్స్‌ప్లాంట్' మరియు 'రొటేషన్ ఫ్లాప్' అన్న ప్రక్రియలను గురించి వ్రాశారు. అవన్నీ కొంత జుట్టు వున్నవారికి. మరి నాకు తల వెంట్రుకలు చాలాపోయినాయి. అసలు వెంట్రుకలు లేని వాళ్ళకు 'హెయిర్ ట్రాన్స్ ప్లాంట్' సాధ్యమా?

జ : అసలు వెంట్రుకలు లేనివాళ్ళు మాకు ఒక గడ్డు సమస్య. ఏ సర్జరీకైనా 'లిమిటేషన్స్' వుంటాయి!

## సర్జరీ వల్ల మచ్చ?

బొబ్బిలి రమణారెడ్డి, నల్లగొండ

ప్ర : ముఖమునకు ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే ఇంతకు ముందు వున్న ఆకారంలో మార్పు వస్తుందా? చేసిన స్థానంలో స్పర్శ వుంటుందా? ఏమైనా మచ్చలు ఏర్పడతాయా?

జ : మార్పు రావడానికి ముఖం మీద ఆపరేషన్ చేయించుకుంటే మరి మార్పు వస్తుంది గదా! స్పర్శలో సాధారణంగా ఎటువంటి మార్పూ వుండదు. మచ్చలు లేకుండా వుండడం, లేక మచ్చలు అతి సూక్ష్మంగా కనబడడం అనేది ప్లాస్టిక్ సర్జరీ ప్రత్యేకత!

## గాయపు మచ్చ

పి. పుష్పావతి, బొమ్మగాని పల్లి

ప్ర : చిన్న వయసులో పడడంవల్ల నుదుటి మీద గాయం ఏర్పడింది. బొటి గింజంత వున్నది 'ఆక్వర్డ్' గా-దీన్ని ప్లాస్టిక్ సర్జరీ ద్వారా సరిచేయవచ్చా?

జ : సరి చేయవచ్చు.

## ఎద్దు చేసిన గాయం

వి. రేణుక, విశాఖపట్టణం

ప్ర : నా వయసు 22 సం.లు. 8 సం. ల వయసులో ఎద్దు పొడవడం వల్ల ఎడమ బుగ్గ మీద 12 కుట్లు పడి 'స్కార్' మిగిలిపోయింది. దీన్ని సరిచేస్తారా? ఆపరేషన్ తర్వాత ఎంత రెస్ట్ కావాలి?

జ : మీకున్న స్కార్‌ను సరిచేయవచ్చు. సుమారు ఒక వారం రెస్ట్ సరిపోతుంది.

## ముక్కుపై మచ్చ

జి. శ్రీనివాసరావు, వేల్పూరు

ప్ర : నా ముక్కు మీద పావలా సైజు పుట్టుమచ్చ వున్నది. ప్లాస్టిక్ సర్జరీ వీలవుతుందా? ఎన్ని రోజులుండాలి హాస్పిటల్‌లో?

జ : పుట్టుమచ్చ తొలగించి చెవి వెనుక భాగం నుండి చర్మం తీసి వేయాల్సి వుంటుంది. హాస్పిటల్‌లో సుమారు ఒక వారం వుండాలి.

చిరునామా: డాక్టర్ (శ్రీమతి) లక్ష్మీసలీమ్, సలజ నర్సింగ్ హోమ్, కనకదుర్గా థియేటర్ ఎదురురోడ్డు, సూర్యారావు పేట, విజయవాడ (520 002)

కాలమ్‌ దాటని కథ

## వీరాస్వామి

సాయంకాలం.

తలంటుకొని తలారబెట్టుకుందామని బంగళా పైకి వెళ్ళాను. ఎదురు డాబా మీద వీరాస్వామి వున్నాడు. వాడు చేతిలో కత్తిని పైకి కిందికి ఎగరేసి పట్టుకుంటు న్నాడు. వాడంటే నాకు భయం. వాడు ఎప్పుడూ ఇరుగు, పొరుగు వాళ్ళతో గొడవ పడుతూంటాడు. చుట్టూ వున్న వాళ్ళను కొట్టి తగాదాలాడేవాడు. అందుకే ఆ ఎదురింటి వాడంటే నాకు భయం. ఈలోగా వాడిని చూస్తూ వున్న నన్ను చూసి వాడు వెకిలిగా పళ్ళికిలించాడు. నాకు ఒళ్ళు మండిపోయింది. నా చేయిని పైకెత్తాను కొడతానన్నట్లుగా . అంతే వాడి ముఖంపై నవ్వు మాయమైంది. ఏదో గ్రహించిన



వాడికిమల్లే చేతిలో కత్తితోనే వెనుదిరిగాడు. నాకు ఉన్నట్లుండి జరగబోయే సంఘటన గుర్తొచ్చి ఒళ్ళు గగుర్పొడిచింది. చాలా భయమేసింది. వాడు వాళ్ళ డాబా దిగుతున్నాడు నావైపే చూస్తూ. వాడు ఒక్కొక్క మెట్టు దిగుతున్నాడు. నాకు భయం ఎక్కువయిపో తోంది. వాడు మెల్లిగా వాళ్ళ డాబా మెట్లుదిగి వరండా లోకొచ్చాడు. వరండాలోకొచ్చి మళ్ళీ ఒకసారి నావైపు చూపు సారించాడు. వాడు మెల్లిగా మా గుమ్మంలో కొచ్చి వరండాలోకొచ్చాడు. నాకు ఏం చేయాలో పాలు పోవడం లేదు. 'మెట్ల గుండా పరుగెత్తికెళ్ళి క్రిందికి దిగుదామంటే వాడు పరుగెత్తుకొచ్చి నన్ను పట్టేసు కుంటాడేమో!? క్రిందికి దిగుదామా! అమ్మో! ఇంకే మైనా వుందా!' ఇలా వస్తున్నాయ్ నాకు ఆలోచనలు. ఈలోగా మా మెట్లు ఎక్కుతున్న శబ్దం వినిపించింది. ఇంకేం! వాడే! వచ్చేస్తున్నాడు. పైకి వచ్చేసాడు. నేను అమాంతం వెళ్ళి వాణ్ణి రెండు చేతుల్తో పైకెత్తేసాను. "ఒరేయ్ 'నాని' బాగుందిరా నీ నడక" అంటూ వాడి చెంపల్ని ముద్దాడాను. ఆ ఐదేళ్ళ వీరాస్వామికి నాకు రోజూ ఇదో ఆట . వాడు కిలకిల నవ్వుతున్నాడు.

- కొంజర్ల శ్రీకాంత్